క్లుప్తంగా

పోలింగ్ ప్రక్రియకు పక్కాగా ఏర్పాట్లు

- ఎన్నికల సెక్టార్ అధికారి జమదగ్ని



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సెక్టార్ అధికారి జమదగ్ని, తదితరులు

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని రెల్లివీధి బాలిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల సెక్టార్ అధికారి జమదగ్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నిక రోజు వైద్యశిబిరంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సుదర్శనరావు, ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు, ఎస్సై గణేష్, రూట్ అధికారి ఇమ్రాన్ ఉన్నారు.

శతశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీసీడీఓ మాలతి

నెల్లిమర్ల రూరల్: పది, ఇంటర్‌లో శతశాతం ఫలితాలు సాధించాలని జీసీడీఓ మాలతి సూచించారు. పట్టణంలోని కేజీబీవీని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. పరీక్షలంటే ఉన్న భయాన్ని విడనాడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఒత్తిడిని అధిగమించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పన్ను వసూళ్లు..



పన్ను వసూళ్ల తనిఖీలో సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్ల ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. పన్ను వసూళ్ల ప్రక్రియ ఏవిధంగా సాగుతున్నదీ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల పరిధిలో అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పన్ను వసూళ్లను చేపడుతున్నారు. ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను వసూలు చేయడంతో పాటు మొండి బకాయిదారులకు నోటీసులు అందజేస్తున్నారు.

భూ సమస్యపై విచారణ



చనమల్లుపేటలో విచారణ జరుపుతున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రైతు చనమల్లు అబద్ధం శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. తన భూ సమస్యను పరిష్కరించేందుకు వీఆర్‌ఓ లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించడంపై తహసీల్దార్ సుదర్శనరావు, తదితరులు చనమల్లుపేట గ్రామానికి శనివారం చేరుకుని విచారణ చేపట్టారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాలరావు, సర్వేయర్ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలోచనా దినోత్సవం



పావెల్ దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షకులు, నిర్వాహకులు

విజయనగరం అర్బన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బెడెన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రాంతీయ శిక్షణ అండ్ క్యాంప్ కార్యాలయంలో 'ఆలోచనా దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలోని బెడెన్ పావెల్, ఆయన సతీమణి బెడెన్ పోల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాక చిన్నంనాయుడు, ఈపు విజయకుమార్, బీవీఏ రాజు, సీహెచ్ నారాయణమూర్తి, డి.ప్రవీణ్‌కుమార్, ఎం.భాస్కరరావు, దుర్గా నాగేశ్వరరావు, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో బేసిక్ స్కౌట్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులకు ధ్రువపత్రాలను ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయకుమార్, డీఈఓ యు.మాణిక్యంనాయుడు అందజేశారు.

పెళ్లి ఖర్చుకు తగ్గేదేలే..

- ఏటేటా పెరుగుతున్న బడ్జెట్
- భోజనాలు, బంగారం, దుస్తులకు అధిక ఖర్చు



కల్యాణ మండపం

విజయనగరం: ధనిక, పేదలనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ వివాహ వేడుక మరపురాని జ్ఞాపకం. తమ ఇంట జరిగే వివాహ వేడుకను ఉన్నంతలో ఘనంగా నిర్వహించుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశపడతారు. గతంలో వధూవరుల ఆర్థిక స్తోమత ఆధారంగా పెళ్లిళ్లు జరగ్గా.. ప్రస్తుతం ఆర్థిక భారమైనా ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

అంతటా పెళ్లిళ్ల సందడి..

మాఘమాసం ప్రారంభం కావడంతో ఈ నెల ఆరో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. జూన్ వరకు ముహూర్తాలున్నాయి. జూన్ తర్వాత ఆషాఢం, మూఢం ఉండడంతో ఆ లోగానే వివాహాలు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నింగిలో నిత్యావసరాలు..

ప్రస్తుతం సాధారణ భోజనం ప్లేటుకు రూ.250, ఘనంగా పెట్టాలంటే రూ.850 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల అల్పాహారం కూడా ట్రెండ్‌గా మారింది. దీనికి ప్లేటుకు రూ.180 వరకు వసూలు చేస్తున్నారు. వీటికి పళ్లరసాలు, శీతల పానీయాలు, చిరుతిళ్లు వంటివి అదనం. ఇక సారె, బహుమతుల ఖర్చు వేరే లెక్క.

మండపాల్లోనే అధికం..

గతంలో వరుడు లేదా వధువు ఇళ్ల వద్ద ఎక్కువగా వివాహాలు జరిగేవి. అయితే మారుతున్న కాలం ప్రకారం కల్యాణ మండపాల్లో వివాహాలు చేసుకోవడం ఇటీవల పరిపాటిగా మారిపోయింది. డబ్బులు ఎక్కువైనా శ్రమ తగ్గుతుందనే ఉద్దేశంతో మండపాల్లో వివాహాలు జరిపించేస్తున్నారు. అలాగే భోజనాలు కూడా ఎక్కువగా క్యాటరింగ్‌కే అప్పగించేస్తున్నారు. జిల్లాలో దాదాపు నాలుగు నుంచి ఐదు వేల వరకు కల్యాణ మండపాలున్నాయి. నాన్ ఏసీ కళ్యాణ మండపాల్లో అయితే పెళ్లికి రూ. 50 వేల వరకు వసూలు చేస్తుండగా.. ఏసీ కల్యాణ మండపాల నిర్వాహకులు మాత్రం సుమారు రెండు లక్షల వరకు వసూలు చేస్తున్నారు. సీజన్‌లో అయితే ఏసీ మండపాల అద్దె రూ. 3 లక్షల నుంచి ఐదు లక్షల వరకు ఉంటుంది. వీటికి తోడు వీడియోలు, ఫొటో షూట్‌లకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిందే.

పసిడి పైపైకి..

గతంతో పోలిస్తే బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.20 వేల వరకు పెరిగింది. సామాన్యులు ఒక వివాహానికి కనీసం 40 గ్రాముల బంగారమైనా కొనుగో చేయాల్సి ఉంటుంది. సంపన్నులైతే 50 తులాల వరకు కొంటున్నారు.

వస్త్రాలపై జీఎస్టీ పోటు..

మధ్య తరగతి వారు వివాహానికి సుమారు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు వస్త్రాల కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. జీఎస్టీ కారణంగా ప్రస్తుతం ఈ తరహా కొనుగోళ్లపై అదనంగా మరో రూ.70 వేలు చెల్లించాల్సి వస్తోంది.

పూలకు ధరలకు రెక్కలు..

పెళ్లి తంతు నిర్వహించేందుకు ప్రత్యేకంగా వివిధ రాకల పూలతో మందిరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. వీటి కోసం రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది. గతంలో వీటిని తయారు చేసే వారు రూ.30 నుంచి రూ.45 వేల వరకు తీసుకునే వారు. ప్రస్తుతం రూ. లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

వాయిద్యాల ఖర్చు మోత

గతంలో బ్యాండ్ పార్టీ కోసం రూ.30 వేల నుంచి 45 వేల రూపాయల వరకు ఖర్చు చేసేవారు. ప్రస్తుతం ఆ ఖర్చు లక్ష రూపాయలకు చేరుకుంది. తెల్లవారుజాము ముహూర్తం పడితే మ్యూజికల్ నైట్ పేరుతో ఏర్పాటు చేసే ప్రొగ్రాంనకు స్థాయిని బట్టి సుమారు లక్ష రూపాయలు కేటాయించాల్సిందే. ఇన్ని రకాలుగా ఖర్చులు పెరుగుతున్నా ఏ ఒక్కరూ తగ్గడం లేదు. ఆడంబరాలకు పోయి ఖర్చులు ఎక్కువ పెట్టి తర్వాత ఆర్థికంగా చితికిపోయే బదులు సంప్రదాయబద్ధంగా తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించుకోవడం మేలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి..

పెళ్లికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఒకరిని చూసి ఇంకొకరు అదనపు ఖర్చులు పెట్టుకుంటున్నారు. వైభవంగా పెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించాలనేది అందరి తాపత్రాయం. ఇందులో భాగంగానే ఖర్చుల భారం పెరుగుతుంది.

– బి.వెంకటరావు, పెళ్లి కుమార్తె తండ్రి, విజయనగరం.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

- అధికారులను ప్రశ్నించిన సభ్యులు



తాగునీటి సమస్యపై ప్రశ్నిస్తున్న సభ్యులు

పూసపాటిరేగ: వేసవిలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ప్రశ్నలవర్షం కురిపించారు. చింతపల్లి, కోనాడ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌ను ఎంపీటీసీ సభ్యులు పతివాడ అప్పలనాయుడు, మైలపల్లి తాత ప్రశ్నించారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా పైప్‌లైన్‌లు వేసి కుళాయిలు వేయడం మరచారని సభ్యుడు టొంపలి సీతారం సభ దృష్టికి తీసుకువచ్చారు. బర్డ్‌ఫ్లూ విజృంభిస్తుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారని పలువురు తెలియజేయగా.. దీనికి వైద్యాధికారి ఈశ్వర శ్రీనివాస్ స్పందిస్తూ చికెన్‌ను వంద డిగ్రీల సెల్సియస్ వద్ద ఉడికిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. తహసీల్దార్ తాడ్డి గోవింద మాట్లాడుతూ.. ప్రభుత్వ బంజరు, కొండ పోరంబోకు, పోరంబోకు భూములలో 2019 అక్టోబర్‌కు ముందు ఇళ్లు నిర్మించుకున్న వారు రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి జీఓ జారీ అయిందని చెప్పారు. 200 చదరపు గజాల్లోపు ఉచితంగాను.. 200 చదరపు గజాలు దాటిన ఇళ్లకు ప్రభుత్వం నిర్దేశించి ధర మేరకు చలానా తీయాల్సి ఉంటుందని చెప్పారు. పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని సభ్యులు కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద, వ్యవసాయ శాఖాధికారి కె.నీలిమ, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీల్స్ ఇండియా సంస్థతో సీతం ఎంఓయూ

విజయనగరం అర్బన్: గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో పారిశ్రామిక వీల్స్ ఇండియా కంపెనీతో కళాశాల యాజమాన్యం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వీల్స్ ఇండియా కంపెనీ హెచ్ఆర్ ఎ.దివాకర్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మధ్య అవగాహన ఒప్పంద సంతకాలు జరిగాయి. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ కూడా అవసరమని.. అందుకోసమే ఈ ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, మెకానికల్ విభాగాధిపతి సీహెచ్ వరలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

విజయనగరం: నగరంలోని గురజాడ అప్పారావు రోడ్‌లో రహదారులను ఆక్రమించి చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలను నగరపాలక సంస్థ సిబ్బంది శనివారం తొలగించారు. అలాగే పోస్టర్లు, ఫ్లెక్సీలను ఎక్కడికక్కడ తొలగించివేశారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. నగరంలోని అన్ని ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

పూడికతీత పనులు

విజయనగరం: నగరంలోని గంటస్తంభం ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువలో పూడికతీ త పనులు శనివారం ముమ్మరంగా చేపట్టారు. జేసీబీ సహాయంతో కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు. ఈ ప్రక్రి యను నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం పరిశీలించారు. రహదారులు, కాలువల్లో చెత్తలు వేసినట్లయితే అపరాధ రుసుం వసూలు చేయాలని సూచించారు.

మ్యాజిక్‌తో సామాజిక చైతన్యం

- మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన
- చైతన్యం నింపుతున్న ఇంద్రజాలికులు
- నేడు ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం



మేజిక్ చారి, న్యాయవాది



పవన్ ఆశీష్, మెజీషియన్



ఎస్‌కె.సలీమ్, ఇంద్రజాలికుడు



పీసీ సర్కార్

విజయనగరం టౌన్: చేతబడులు, చిల్లంగులు.. మానవుడ్ని అనాగరికుడ్ని చేస్తున్నాయి. నోట్లోంచి శివలింగాలు సృష్టించడం, అమాయక భక్తుల్ని మోసం చేయడం, ప్రజల దృష్టి మరల్చి వారిని మోసం చేయడం పరిపాటిగా మారిన తరుణంలో ఇంద్రజాలికులు మానవతాదృక్పథంతో కొంత సాహసం చేసి, మరో అడుగుముందుకేసి ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పద్మశ్రీ పీసీ సర్కార్ (సీనియర్) జన్మదినమైన ఫిబ్రవరి 23న ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న ఇంద్రజాలికులపై ప్రత్యేక కథనం.

ఆసక్తే ప్రేరణ కల్పించింది..

చిన్ననాటి నుంచి ఇంద్రజాలమంటే ఎంతో ఆసక్తి. అదే ఆసక్తి నాలో ప్రేరణ కల్పించి మ్యాజిక్ నేర్చుకునేలా చేసింది. అవకాశం వచ్చినప్పుడల్లా గ్రామాల్లో మ్యాజిక్ కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నాను. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్నప్పటికీ ఎక్కడ అవకాశం వచ్చినా ప్రజల్లో మార్పు తీసుకువచ్చేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాను.

– పవన్ ఆశీష్, మెజీషియన్

ప్రోత్సహించాలి..

చేతబడులు, చిల్లంగులు పూర్తిగా మోసం. అటువంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పటివరకు సుమారు ఐదు వేలకు పైగా ప్రదర్శనలిచ్చాం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తా.

– ఎస్‌కె.సలీమ్, ఇంద్రజాలికుడు

న్యాయవాది వృత్తిలో రాణిస్తూ...

ఓ పక్క న్యాయవాద వృత్తిలో రాణిస్తూ.. మరోపక్క సమాజ సేవలో తరిస్తున్నాను. మూఢ నమ్మకాలను పారద్రోలేందుకు ఎంతగానో ఉపయోగపడే మ్యాజిక్‌ను చేస్తూ, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో కూడా ప్రదర్శనలిస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తున్నాం.

– చారి, న్యాయవాది

• పరామర్శ



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 34వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు శనివారం పైడిరాజు ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కార్పొరేటర్లు జీవీ రంగారావు, వింత ప్రభాకర్, ఎస్. బాబు, పార్టీ నాయకులు మొయిద ఆదిబాబు, తదితరులున్నారు.

– విజయనగరం

• వితరణ..



పూసపాటిరేగ మండలంలోని కొల్లాయివలసకు చెందిన క్రీడాకారిణి పైడి వసంతకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి రూ. 27 వేల విలువ చేసిన షూ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాధవి మాట్లాడుతూ.. క్రీడల్లో బాగా రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వందనాల అప్పలరాజు, శంకాబత్తుల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

సెంచూరియన్‌లో గజజ్యోతి వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న వీసీ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో గజజ్యోతి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి జ్యోతిని వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే వేడుకల్లో విద్యార్థులు తమ ఆనందాలను పంచుకోవాలని సూచించారు. ప్రముఖ సినీ విమర్శకుడు, రచయిత రామ్‌వెంకట శ్రీకర్ తొలిరోజు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరం

- భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ రవికుమార్, తదితరులు

పూసపాటిరేగ: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ అన్నారు. మండలంలోని ఎరుకొండలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, చెడు అలవాట్ల వల్ల యువత జీవితాలు నాశనమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బందితో పాటు గ్రామానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



అధికారులకు సూచనలు అందిస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో మండలస్థాయి అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దన్నానపేట, రామతీర్థం ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలను అక్రమంగా తొలగించారని సర్పంచ్‌లు గేదెల రామచిరంజీవి, కంచరాపు సూర్యకళ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల రెవెన్యూ సర్వేయర్ అందుబాటులో ఉండడం లేదని, ఫోన్‌కు కూడా స్పందించడం లేదని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్‌లు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా అభివృద్ధి పనులు కొనసాగుతుండడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తిస్థాయిలో జరిగేటట్లు చూడాలన్నారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ, జీబీఎస్ వ్యాధుల పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొందని, వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ శంకర జగన్నాథం, ఏఓ సుదర్శనం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో పరిశుభ్రత



అక్కివరంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న మండల విస్తరణాధికారి శ్రీనివాసరావు

డెంకాడ: పరిశుభ్ర గ్రామాల కోసం ప్రజలు సహకరించాలని మండల విస్తరణాధికారి దేశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని జొన్నాడ, ఆకులపేట, అక్కివరం, గంట్లాం, డెంకాడ, నాతవలస గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు, చెత్త సేకరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా శనివారం 16,340 ఇళ్లకు క్లాప్‌మిత్రలు వెళ్లి చెత్త సేకరించారన్నారు. చెత్తను ఎక్కడిపడితే అక్కడ వేయకుండా మీ ఇళ్లకు వస్తున్న క్లాప్‌మిత్రలకు అందజేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: వంద రోజుల పాటు కొనసాగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు కోరారు. మండలంలోని మొయిద సచివాలయం వద్ద దివంగత మాజీమంత్రి పెనుమత్స సాంబశివరాజు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వంద రోజుల ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా తన తండ్రి సాంబశివరాజు జ్ఞాపకార్థం ఉచిత వైద్యసేవలు అందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎం.డి శ్రీరామమూర్తి, సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.